# వైఎస్ జేబు సంస్థతో ఓటర్ల జాబితా తయారీ

రాష్ట్రంలో వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డి ప్రభుత్వం ఓటమి భయంతో ఏకంగా ఓట్లను గల్లంతు చేసేందుకు, తారుమారు చేసేందుకు ప్రయత్నిస్తోందని తెలుగుదేశం పొలిట్ బ్యూరో ఆరోపించింది. వైఎస్ తనకు కావాల్సిన వారి కంపెనీకి ఓట్ల నమోదు, క్రమబద్ధీకరణ సాఫ్ట్‌వేర్ కాంట్రాక్టును ఇచ్చి, దాని ద్వారా 45 శాతం ఓట్లను తారుమారు చేసేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించింది. ఈ ప్రభుత్వం ఏం చేసినా ఓటమిని తప్పించుకోలేదని వ్యాఖ్యానించింది. ప్రభుత్వం పట్ల ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉందని, తెలుగుదేశం విజయం ఖాయమని పొలిట్ బ్యూరో ధీమా వ్యక్తం చేసింది. ఓట్ల గల్లంతు వ్యవహారంపై కేంద్ర, రాష్ట్ర ఎన్నికల కమిషనర్లకు ఫిర్యాదు చేస్తామని ప్రకటించింది. శుక్రవారం అనంతపురంలో జరిగిన తెదేపా పొలిట్ బ్యూరో సమావేశ అనంతరం పార్టీ నేతలు ఎర్రన్నాయుడు, యనమల రామకృష్ణుడు తదితరులు విలేకరుల ముందు ఈ ఆరోపణలు చేశారు.

# త్యాగధనుల స్ఫూర్తే ఆదర్శం: చంద్రబాబు

**అనంతపురం, న్యూస్‌టుడే:** దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణత్యాగం చేసిన ఎందరో మహానుభావుల జీవితాలే మనకు ఆదర్శం.. వారి స్ఫూర్తితో దేశ ప్రగతికి పునరంకితం కావాలని తెదేపా అధినేత చంద్రబాబు ప్రజలకు పిలుపునిచ్చారు. శుక్రవారం అనంతపురంలోని ఎంజీఆర్ కళ్యాణమండపంలో బాబు జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. ఆ తర్వాత పార్టీ జెండాను కూడా ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ '62వ స్వాతంత్ర్య వత్సరంలోకి అడుగుపెడుతున్నా సమాజాన్ని ఇంకా ఎన్నో రుగ్మతలు, సమస్యలు పీడిస్తున్నాయి. ఎంతో మందికి ఆర్థిక స్వాతంత్ర్యం రాలేదు. ఈ నేపథ్యంలోనే 'మీ కోసం' యాత్రను తలపెట్టాం. మరో ఆర్థిక స్వాతంత్ర్యానికి ప్రతి ఒక్కరూ నడుం బిగించాలి' అని చంద్రబాబు పిలుపు నిచ్చారు.

# నేడు ఎన్టీఆర్ భవన్‌కు చంద్రబాబు

**హైదరాబాద్, న్యూస్‌టుడే:** మీకోసం యాత్ర ముగియడంతో తెదేపా అధ్యక్షుడు చంద్రబాబు 118 రోజుల తర్వాత శనివారం హైదరాబాద్‌లోని పార్టీ కార్యాలయమైన ఎన్టీఆర్ భవన్‌కు అనంతరం ఇంటికి వెళ్లనున్నారు. మీకోసం పేరుతో రాష్ట్రవ్యాప్తంగా విస్తృతంగా పర్యటించిన ఆయన.. శుక్రవారం అనంతపురంలో భారీ బహిరంగసభతో యాత్రను ముగించారు. అక్కడి నుంచి నేరుగా తిరుపతి వెళ్ళిన బాబు.. శనివారం ఉదయం కొండపైకి వెళ్ళి శ్రీవారిని దర్శించుకుంటారు. అనంతరం తిరుపతి నుంచి విమానంలో బయలుదేరి శంషాబాద్‌లో దిగుతారు. అక్కడ పార్టీ కార్యకర్తలు ఆయనకు ఘనంగా స్వాగతం పలుకుతారు. ఊరేగింపుగా ఎన్టీఆర్ భవన్‌కు చేరుకుంటారు.

**21న కోర్ కమిటీ భేటీ:** ప్రత్యేక తెలంగాణ అంశంపై ఏర్పాటైన పార్టీ కోర్ కమిటీ ఈనెల 21న హైదరాబాద్‌లో భేటీ కానుంది. ఈ లోగా కమిటీ వివిధ ప్రాంతాలకు చెందిన నేతలతో సమావేశమై అభిప్రాయాలు తెలుసుకుంటుంది. సెప్టెంబరులో కూడా మరో రెండు మూడు సమావేశాలు నిర్వహించి అక్టోబరులో తన నిర్ణయాన్ని పొలిట్‌బ్యూరోకు తెలియజేసే అవకాశముంది.

# సభ విజయవంతంపై బాబుకు మాయావతి ఫోన్

**హైదరాబాద్, న్యూస్‌టుడే:** చంద్రబాబు మీకోసం యాత్ర, పునరంకిత బహిరంగ సభలు విజయవంతం కావడంపై ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి మాయావతి హర్షం వ్యక్తం చేశారు. ఆమె శుక్రవారం చంద్రబాబుకు ఫోన్ చేసి 'చాలా సంతోషంగా ఉంది' అని చెప్పారు. బహిరంగ సభకు తరలివచ్చిన భారీ జన సందోహాన్ని, మొత్తం కార్యక్రమాన్ని టీవీలో వీక్షించానని తెలిపారు.